# ఒంటరిచావు

ఆ జొన్న విత్తులకు పుటకలోనే జాతీయాభిమాన మంకురించింది. అప్పుడప్పుడే స్వరూపాలు ఏర్పడుతున్నాయి ఆ విత్తులకు. పెద్దగాలి చుట్టుకుంది. నిమిషమాత్రమైన స్థిమితంగా నిలవబడనీయక కిందుమీదుగా ఊపివేసింది ఆ గాలి. అప్పుడా విత్తుల్లో ఘనమైంది యిట్లా అంది "మనము కొంచము అంకుర ప్రాయంగా అయినామొ లేదో గాలి చిచ్చులా చుట్టుకొని ఊపుతుంది. మనము యింకా కొంచము బలంగా అయితే దాని ఆటలు సాగవని తెలుసు. గాలి ఎంతైన ఊపనీయి. మనము ఒక్కళ్ళము దాని మాయలో పడవద్దు. ఎప్పటినుండి కాచుకొని చూస్తుందో మరి?" గింజలు యిట్లా తమలో తాము గుసగుసలు ఆడుతున్నాయి. గాలి నేలకు విసిరింది ఆ మొక్కను.

"చూశారా? ముండగాలి........ ఎట్లా ప్రతాపము చూపుతుందో! ఆడుతుంది గొంతు కోయాలని జాగ్రత్త పట్టువిడిచేరు. బాగ పట్టుకోండి. ఎంత ఎగురుతుందో చూద్దాము" అని ఆ ఘనమైన గింజ అన్నిటిని హెచ్చరించింది. గాలి ఊపింది, నేలకు విసిరింది, వేళ్ళదగ్గర నుండి పెళ్ళగిలేటట్టు ప్రళయనృత్యం చేసింది. గింజలన్ని మౌనంగా ఆ బీభత్సాన్ని ఎదుర్కొంటూ ఉన్నట్టు గాలి నేలకు వంచితె చక్కా లేచి నిలచాయి. తమ అణుమాత్రమైన జీవాలన్నిటికి కేంద్రీకరించుకొని గాలికి ఎదురుతిరిగాయి. నీవు ఎంత వంచిన నీ ముందు వంగేది లేదన్నట్టుగా లేచి చక్కా నిలబడ్డాయి. గాల మరీ విజృంభించింది. గగ్గోలు చేసింది. 'కానీయి!' అన్నాయి విత్తులు'. నీ ఊపిరితిత్తుల్లో ఆఖరు శ్వాస లేకుండా ఊదేయి. మూల మూలల ఉన్న నీ బలాన్ని అంతా పైకి తోలు. జంకేదిమాత్రము లేదు. గాలి విసిరి విసిరి, తన ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయనట్టుగా వెళ్ళిపోయింది. కాలమేఘము పై నుండి తొలగిపోయినట్లు అమ్మయ్య అని నిట్టూర్పులు తీసాయి విత్తులు. విజయగర్వంతో అవన్నీ ఉబ్బిపోయినాయి. వాటి అణువు అణువులలో సంతోషజ్వాల పరువులు పెట్టింది. వాటిలోని ఆ ఘనమైనవిత్తు జాతీయ ఉద్రేకంలో "సోదరులారా!" అని తతిమ్మావాటిని హెచ్చరించింది. "చూశారా! జాతీయతలో ఉండే బలము? జాతీయత గల ఒక అణువు బ్రహ్మాండాన్ని గూడ ఎదిరించవచ్చుననే విషయము యీరోజు ఋజువైంది. మన మీ చరిత్ర సంఘటనను మరవగూడదు. మన మీ సంఘటనను మరిస్తే మన జాతీయతే నశిస్తుంది. మన జాతీయత నశించిన్నాడు మనమే నశించిపోతాము" అంటూ ఉపన్యాస్యాన్ని ముగించింది.

తెల్లవారి దారినిపోతూవున్న ఓ పడుచు ఆ కంకి విరిచి కర్రతో విత్తులురాలుస్తు ఉంటే అకస్మాత్తుగా ఆ బలిసిన విత్తు ఆమె తలవెంట్రుకల్లో రాలింది. పరిమళాలు వెదజల్లుతు ఉన్న ఆమె కేశపాశములో చిక్కుకొని, ఏదో దివ్యలోకములో పడ్డట్టు అయింది ఆ విత్తుకు. సువాసనలో మైమరచిపోయింది. అణువు అణువులో ఆ పరిమళాలు నిండగా తన్మయావస్థలో పొర్లాడింది. పట్టుకుచ్చులల్లావున్న ఆ వెంట్రుకలు మెత్తగా సోకగానే "ఎవ్వరే నన్ను పోకుండ ఆపేది" అని తలవెంట్రుకల ముద్దాడింది. "ఏమైన కానీయి. నేనీలోకాన్ని మాత్రము విడిచేది లేదు. నాలో ఏదో ప్రత్యేకత ఉండబట్టే నాకీ స్థానం లభించింది. లేకుంటే యింత మెత్తనిశయ్య, యింత చక్కని పరీమళాలు ఊరకనే లభిస్తాయా? మొదటినుండే యీలాంటి పదవి ఎప్పుడో లభిస్తుందని నాకు తెలుసు. నాలో ఉన్న గొప్పదనమే నన్నిట్లా బయటికి తీసుకవచ్చింది. ఎంత అధముల మధ్య ఉంటే మాత్రమేమి! ప్రతిభ ఎన్నటికైన జీకటిని చీల్చుకొని బయటికి వస్తుంది" యిట్లా తనలో తాను ఉబ్బిపోతూ గర్వంగా కిందికి చూచింది ఆ విత్తు. కర్ర దెబ్బలకు నేలరాలి చిందరవందరగా పడివున్నాయి విత్తులన్నీ.

"వీటికి ఏనాడో యీగతి పట్టుతుందని ఆనాడే అనుకొన్నా, అల్పోద్రేకాలు కాకపోతే ఏమిటీ వీటి జాతీయత? పోట్లాడటము తప్ప ఎందుకు పనికివస్తుంది జాతీయత! దయాధర్మము మీద ప్రపంచములో దారి దొరకాలేకాని యీ పోట్లాటలతో ఏమవుతుంది? ఏమి నాకు పోట్లాదేశక్తి, సాహసము లేకనేనా యిట్లా వచ్చింది. నేను నాలాంటివాళ్ళనెందరనో నిప్పు తొక్కిన కోతులమాదిరి ఎగిరించగలను. జాత్యభిమానమనే నిప్పు యింటింటికి అంటించి అవి మండుతూవుంటే దేశభక్తిలో మునకలు వేయగలను.

"స్వనాశాన్ని పురికొల్పే యీ జాతీయాభిమానమనే సారాయిని ఏపిశాచమో కల్పించి వుంటుంది. లేకపోతే దీని స్పర్శ తగిలిన ప్రతి జీవము శివమెత్తినట్లు ఎందుకు పరుగులు పెడుతుంది? అయినదేదో అయిపోయినది. యిక వీటిని దారికి తీసుకువస్తాను. ఒంటరితనములోవున్న సౌఖ్యాన్ని, స్వేచ్ఛను రుచి చూపిస్తాను. యేమి మేమంతా ఒకళ్ళ నొకళ్ళము అంటుకొని పుట్టామా? అయితే యికెందుకు జాతీయత? జాతీయతయని ఏదో మునిగిపోతున్నట్టు పెద్దగా అరవడం? ఏదో నా వివేకాన్ని బట్టి నాకీస్థానం లభించింది. ఇక వీటితలల్లో చొచ్చిన ఆకుళ్లను లాగి పారవేస్తాను. ఎవ్వళ్ళంత వాళ్లు ఉన్నత పదవులందుకోవడంలోనే నిజమైన సుఖం వుందని బోధిస్తాను. అంతకూ వినకపోతే ఆకలికి మాడ్చి దారికి తెస్తాను! అంటూ దర్పంగా కిందరాలిన విత్తులవైపు చూచింది కంకినుండి విత్తులన్నీ రాలిపోగానే నేల రాలినవాటినన్నిటిని మూటగట్ట దొడగింది పడుచు. తలవైపున్న గింజ బాగా చూచింది.

"ఇక తెలుస్తుంది వీటి ప్రభావము? జాతీయత అంటే ఏమిటో రుచి చూపిస్తాను. ఒకదానిపై ఒకటిపడి ఉక్కిరిబిక్కిరి కావాలె. గుక్కతిప్పకుండా లోలోన ఉడికిచావాలె. చూడు తమాషా!" అంటూ పడుచు వెన్నుపై వేసుకొన్న కొంగు ముడివైపు బాగా చూచింది. గట్టిగా బిగిసినముడి చినిగి ఒక్కటొక్కటిగా పారిపోతున్నాయి విత్తులు.

తనప్రయత్నమంతా వ్యర్థమైనట్టు వుడికిపోయింది విత్తు "దేశద్రోహులు ముడిచించుకొని పారిపోతున్నారు. వీటిని పట్టుకొని మళ్ళీ బంధించాలె. లేకుంటే దేశములో మళ్ళీ అరాచకం వ్యాపిస్తుంది. శాంతి మంట కలుస్తుంది." అంటూ కిందుమీదుగా తలపైన ఎగిరింది. జారిపోతున్న విత్తులన్నీ దాని తొందరపాటు చూచి" ఏమైంది? 'ముందు వుంది నీగతి' అన్నట్టుగా దానివైపు చూచాయి. స్వేచ్ఛగా జారిపోతున్న ఆ విత్తుల చూచేవరకు 'అయ్యో! ఒంటరిదాన్ని అయిపోతున్నానే' అనే భయం పుట్టింది. 'మళ్ళీ ఎట్లా వీటిలో కలవను అనే ఆరాటం బయలుదేరింది. అక్కడినుండి లేచిపోవాలని వెంట్రుకలన్నిటిని విదలించ దొడగింది.

ఇంతలో పడుచు యిల్లుచేరి పొయ్యిపైన కంచుడువేసి కొంగు విప్పి చూసుకుంది. ఒక్కవిత్తుకూడా లేదు. 'అయ్యో ఖర్మమా అని నిర్ఘాంతపోయి తల దురద పెడుతూవుంటే గోక్కుంది. గోక్కోవడంలో ఆ ఘనమైనగింజ వేళ్ళమధ్య చిక్కింది. ఎర్రగా కాగివుంది పెనము. గోళ్ళతో అట్లాగే తీసి ఆ పెనములో పడవేసింది ఆ విత్తును. హృదయాన్ని చింపుకొని ఏమో అయిపోయింది. కాని ఆ ధ్వని బయటికి రాకముందే మాడి మసి అయిపోయింది ఆ విత్తు.

---